గడప గడపకు వెళ్లిన ఫలితం

- 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో సమస్యల గుర్తింపు
- ప్రతి గ్రామ సచివాలయానికి రూ. 20 లక్షల మంజూరు
- సీసీరోడ్లు, డ్రెయినేజీ, నీటి పైప్ లైన్ సమస్యలకు శాశ్వత పరిష్కారం
- హర్షం వ్యక్తం చేస్తున్న గ్రామ ప్రజలు

బాపట్ల అర్బన్: ఎంతోమంది పాలకులు వచ్చినా గ్రామాల సమస్యలను గాలికి వదిలేశారు. దీంతో ప్రజలు సమస్యలతో సహా జీవనం చేయడానికి అలవాటు చేసుకున్నారు. అయితే గ్రామస్థాయిలో సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయించారు. ఇందుకు గడప గడపకు మన ప్రభుత్వం ద్వారా సమస్యలను గుర్తించే కార్యక్రమం చేపట్టారు. సమస్యల పరిష్కారానికి ప్రతి గ్రామ, వార్డు సచివాలయానికి రూ.20 లక్షల కేటాయించారు. దీంతో పల్లెల్లో సమస్యలు వేగంగా పరిష్కారమవుతున్నాయి. గ్రామాల్లో సీసీరోడ్లు, డ్రెయినేజీల సమస్యల పరిష్కారానికి ఈ నిధులు వినియోగిస్తున్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గంలోని ప్రతి గ్రామాన్ని, ఇంటిని సందర్శిస్తున్నారు. గ్రామాల్లో కలియ తిరిగి సమస్యలను తెలుసుకొని అధికారులు ద్వారా వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నారు. అందుకు నిదర్శనమే.. ఈ దృశ్యాలు.





గుడిపూడి గ్రామంలో అధ్వానంగా ఉన్న మట్టి రోడ్డు.. ప్రస్తుతం సీసీ రోడ్డుగా ఇలా..





మూలపాలెం గ్రామ పంచాయతీలో సీసీ రోడ్డుతో మారిన రూపురేఖలు

21 సచివాలయాల్లో గడప గడపకు పూర్తి

బాపట్ల మండలంలో 28 గ్రామాలు, 21 సచివాలయాలు ఉన్నాయి. 21 సచివాలయాల్లో ఎమ్మెల్యే కోన రఘుపతి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం పూర్తిచేశారు. ప్రజా సమస్యలను తెలుసుకొని, ఆ సచివాలయానికి ప్రభుత్వం మంజూరు చేసిన రూ. 20 లక్షలతో అభివృద్ధి పనులను పరుగులు పెట్టిస్తున్నారు.

తీరిన సీసీ రోడ్లు, డ్రెయినేజీల సమస్యలు

గడప గడపకు నిధులతో సచివాలయం పరిధిలోని సీసీ రోడ్లు, డ్రెయినేజీలు, పైపులైను సమస్యలను అధికారులు పరిష్కరించారు. ప్రస్తుతానికి అప్పికట్ల, పుండ్ల, ఈతేరు, ఈస్ట్ బాపట్ల, భర్తీపూడి గ్రామాల్లో పనులు పూర్తయ్యాయి. మిగతా గ్రామాల్లో పనులు ప్రారంభించారు. వాటిని కూడా త్వరలో పూర్తి చేసేందుకు అధికారులు చర్యలు ముమ్మరం చేశారు.

ప్రతి గ్రామంలో సీసీ రోడ్లు, డ్రెయినేజీల ఏర్పాటుకు కృషి



ఇప్పటివరకు 21 సచివాలయాల పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే కోన రఘుపతి నిర్వహించారు. సచివాలయానికి కేటాయించిన రూ.20 లక్షలతో సీసీ రోడ్లు, డ్రెయినేజీ సమస్యలు పరిష్కరించారు. గ్రామాల్లో ఇతర సమస్యలను పరిష్కరిస్తున్నారు.

– ఏ.రాధాకృష్ణ,
ఎంపీడీవో బాపట్ల

ముమ్మరంగా పనులు చేస్తున్నాం



మా గ్రామంలో సీసీ రోడ్లు, డ్రెయినేజీ కాలువలకు ప్రభుత్వం రూ.20 లక్షల మంజూరు చేసింది. ఆ పనులు పూర్తయిన వెంటనే బిల్లులు మంజూరయ్యాయి. చేసిన పనులకు బిల్లులు ఈ ప్రభుత్వంలో మంజూరు కావని ప్రతిపక్షాలు ఆరోపించాయి. ఇది అబద్ధం. అంతే కాకుండా మా గ్రామంలో పైపులైన్లు, ఇంటింటికి కుళాయి కనెక్షన్లు పనులు కూడా పూర్తి చేశాం. బిల్లులు కూడా వెంటనే విడుదలయ్యాయి.

– బోలిమేర అనిల్‌కుమార్,
మూలపాలెం సర్పంచ్

సీసీ రోడ్లు, డ్రెయినేజీలు లేక అవస్థలు పడ్డాం



కొన్నేళ్లుగా మా కాలనీలో సీసీ రోడ్లు, డ్రెయినేజీలు లేక అనేక అవస్థలు పడ్డాం. వర్షం వస్తే ఇళ్ల ముందు మోకాళ్ల లోతు వరకు నీరు నిలిచేది. కనీసం కాళ్లు మోపడానికి కూడా ఇబ్బంది పడ్డాం. వర్షపు నీరు ఇళ్లలోకి వచ్చిన సందర్భంగా ఎమ్మెల్యే మా ఊరికి వచ్చి..పరిశీలించారు. వెంటనే సీసీ రోడ్లు, డ్రెయినేజీ కాలువల సమస్యను పరిష్కరించారు. మాట నిలబెట్టుకున్నందుకు ఎమ్మెల్యే కోన రఘుపతికి ధన్యవాదాలు.

– తాడేపల్లి కోటేశ్వరి,
గుడిపూడి గ్రామం, బాపట్ల

మురుగు కాల్వలు ఏర్పాటు చేశారు



మా గ్రామంలో కొన్నేళ్లుగా సీసీరోడ్లు, మురుగు కాలవలు లేకపోవడంతో ఇళ్ల ముందే మురుగు నిల్వ ఉండి దుర్గంధం వెదజల్లేది. దీంతో చాలా ఇబ్బంది పడేవాళ్లం. మా కాలనీలో చాలామంది అనారోగ్యం పాలయ్యారు. ఎమ్మెల్యే కోన రఘుపతి మా గ్రామానికి వచ్చి సమస్యను తెలుసుకొని, తక్షణమే రోడ్లు, మురుగు కాలవలను నిర్మించాలని అధికారులను ఆదేశించారు. కాల్వ పనులను వెంటనే ప్రారంభించి పూర్తిచేశారు. ఎమ్మెల్యే మాట నిలబెట్టుకోవడం ఎంతో సంతోషంగా ఉంది.

–ముప్పాళ్ళ రవి కుమారి, అప్పికట్లగ్రామం.

క్లుప్తంగా

రామాలయానికి ఎమ్మెల్యే రూ.లక్ష విరాళం



పిట్టలవానిపాలెం: పిట్టువానిపాలెం గ్రామంలో రామాలయం నిర్మాణానికి బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి రూ.లక్ష విరాళం అందజేశారు. గ్రామ సర్పంచ్ యేట్ర అశ్వినీకి బాపట్లలోని తన కార్యాలయంలో నగదును ఆయన శుక్రవారం అందించారు. సర్పంచ్ వెంట యేట్రా శివారెడ్డి, యేట్ర శ్రీనివాసరెడ్డి, యేట్ర గాంధీరెడ్డి, ఆదినారాయణరెడ్డి ఉన్నారు.

ఎంఈఓలకు సన్మానం



పిట్టలవానిపాలెం: మండల విద్యాశాఖాధికారిగా వి.వెంకటేశ్వరరావును ప్రభుత్వం నియమించింది. అలాగే నిజాంపట్నం మండలం ప్రజ్ఞం జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం రాజారత్నంను ఎంఈఓ–2గా పదోన్నతి కల్పించింది. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన మండల విద్యాశాఖాధికారులను ఏపీటీఎఫ్ మండల శాఖ ఉపాధ్యాయులు శుక్రవారం ఘనంగా సన్మానించారు. సమన్వయంతో కలిసి పనిచేద్దామని వారు పిలుపునిచ్చారు. ఏపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి జంపాని శ్రీనివాసరావు, మండలాధ్యక్షుడు చక్రపాణి, కార్యదర్శి పరిశ నరసింహారెడ్డి ఉన్నారు.

'ఆణిముత్యాలు'కు సత్కారం



అమృతలూరు(భట్టిప్రోలు): అమృతలూరులోని జెడ్పీ హైస్కూల్‌లో జగనన్న ఆణిముత్యాలు పురస్కాల ప్రదాన కార్యక్రమం జరిగింది. హెచ్ఎం కనపర్తి నిరీక్షణరావు అధ్యక్షతన హైస్కూల్‌లో టెన్త్ పరీక్ష ఫలితాల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన సీహెచ్ మౌనిక, జ్యోతుల రాహుల్, యశ్వంత్‌లకు వరుసగా రూ. 3 వేలు, రూ.2 వేలు, వెయ్యి రూపాయల నగదు, ప్రశంసా పత్రాలు, పతకాలను ఎంపీపీ రాపర్ల నరేంద్రకుమార్ అందజేశారు. సర్పంచ్ దేవరకొండ రాము, ఎస్ఎంసీ చైర్మన్ ఎ.వెంకయ్య, వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

కౌలు కార్డులపై అవగాహన

పిట్టలవానిపాలెం: గోకరాజునల్లిబోయినవారిపాలెం, పిట్టువారిపాలెం గ్రామాల్లో వ్యవసాయ, రెవెన్యూ శాఖల ఆధ్వర్యంలో కౌలు రైతులకు పంట సాగు హక్కు పత్రాలపై అవగాహన కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ మహిళా విభాగం బాపట్ల అధ్యక్షురాలు యేట్ర అశ్వినిరెడ్డి పాల్గొని, మాట్లాడారు. ప్రభుత్వ రాయితీలను కౌలు కార్డుల ద్వారా పొందే అవకాశం ఉందన్నారు. మండల వ్యవసాయ విస్తరణాధికారి సుదర్శనరావు, వీఆర్వోలు సిరాజుద్దీన్, నాగాంజనేయులు, వ్యవసాయ విస్తరణాధికారిణి శేషమ్మ, పంచాయతీ కార్యదర్శి వెంకటరెడ్డి, వీవీఏలు స్వాతి, రాజశేఖర్‌రెడ్డి ఉన్నారు.

నాలుగేళ్ల డిగ్రీపై అవగాహన

పిట్టలవానిపాలెం: ఖాజీపాలెం డిగ్రీ కళాశాలలో జాతీయ విద్యా విధానంలో భాగంగా నూతనంగా ప్రవేశ పెట్టబడిన ఆనర్సు డిగ్రీలో సింగిల్ మేజర్ సబ్జెక్టు, మైనర్ సబ్జెక్టులపై అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ప్రిన్సిపల్ డాక్టర్ టి.శివప్రసాద్ మాట్లాడుతూ ఈ విధానంలో విద్యార్థి తనకు నచ్చిన సబ్జెక్టును తీసుకునే అవకాశం ఉందన్నారు. వైస్ ప్రిన్సిపల్ నారాయణరెడ్డి, కంప్యూటర్ లెక్చరర్ సోమయాజులు పాల్గొన్నారు.

ఎల్ఐసీ ఏజెంట్ల కార్యవర్గం ఎన్నిక ఏకగ్రీవం

బాపట్ల అర్బన్: అందరూ కలిసి పనిచేస్తే లక్ష్యాన్ని సాధించవచ్చని ఎల్ఐసీ ఏజెంట్ల జోనల్ ప్రెసిడెంట్ బి.మార్కండేయులు అన్నారు. పట్టణంలోని విస్తరణ శిక్షణా కేంద్రంలో బాపట్ల ఎల్ఐసీ ఏజెంట్‌ల సర్వసభ్య సమావేశం శుక్రవారం జరిగింది. సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఏక్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా చేగూడి అంకయ్య, కార్యదర్శిగా బోడపాటి చంద్రశేఖరరావు, కోశాధికారి యక్కల దత్తాత్రేయులు, ఆర్గనైజింగ్ సెక్రటరీ గూడపాటి జాన్‌వెస్లి, వైస్ ప్రెసిడెంట్స్ గాంధీ, రమేష్ కుమార్, పరిశరామ్, శంకరరావు, జాయింట్ సెక్రటరీలు రవీంద్ర, ఉస్మాన్, వెంకటేశ్వరరావు, పద్మనాభం, కొండలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. డివిజనల్ వైస్ ప్రెసిడెంట్ సి.రాంబాబు, ఆరిగ రవీందర్ రెడ్డి, డివిజన్ జనరల్ సెక్రెటరీ కళం శ్రీనివాసరెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ పాల్గొన్నారు.

కౌలు కార్డు తప్పనిసరి

బాపట్ల అర్బన్: ముత్తయపాలెం గ్రామ రైతు భరోసా కేంద్రంలో శుక్రవారం కౌలు కార్డులపై అవగాహన సదస్సు జరిగింది. ఏఓ చంద్ర శేఖర్ మాట్లాడుతూ.. ఈ నెల 28 వరకు ప్రతి గామంలో అవగాహన కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. కౌలు కార్డుకు దరఖాస్తు చేసుకునే రైతులు పొలం యజమాని ఆధార్, పాస్‌పుస్తకాల జిరాక్స్‌లతో పాటు కౌలురైతు ఆధార్ జిరాక్స్, పాస్‌పోర్టు సైజు ఫొటోతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ముత్తాయపాలెం గ్రామ సెక్రెటరీ కె.ఝాన్సీలక్ష్మి, వీఏఏలు పాల్గొన్నారు.

మురుగు కాల్వలో పూడికతీత

భట్టిప్రోలు: ఎట్టకేలకు భట్టిప్రోలులోని అల్లూరు కాల్వకట్ట మురుగు కాల్వ పూడిక తీత పనులను పంచాయతీ సిబ్బంది శుక్రవారం చేపట్టారు. పంచాయతీ కార్యదర్శి కోట శ్రీనివాసరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ గరికపాటి శ్రీరాములు పనులను పర్యవేక్షించారు.

ప్రజల సంక్షేమమే..ప్రభుత్వ లక్ష్యం

గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మంత్రి మేరుగ నాగార్జున

ఆలపాడు(వేమూరు): గడప గడపకు సంక్షేమ పథకాలు అందించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున అన్నారు. చుండూరు మండలంలోని ఆలపాడు గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని శుక్రవారం ఆయన నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలు అమలు తీరుఅడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రజలందరు సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పార్టీలకు అతీతంగా, పారదర్శకంగా, సంక్షేమ పథకాలు ప్రభుత్వం అమలు చేస్తోందని చెప్పారు. గత టీడీపీ ప్రభుత్వం ఒక సామాజిక వర్గం అభివృద్ధి కోసం పని చేసిందని విమర్శించారు. అందువల్ల ప్రజలందరూ తెలుగుదేశం పార్టీకి బుద్ధి చెప్పారని గుర్తుచేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని వర్గాల ప్రజలను అభివృద్ధి చేయాలని మహా సంకల్పంతో పని చేస్తున్నారని చెప్పారు. ప్రతిపక్ష నేత నారా చంద్రబాబునాయుడు ఎన్ని కుయుక్తులు పన్నినా.. మరలా ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌కు ప్రజలు పట్టం కట్టేందుకు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నరాలశెట్టి సురేష్, ఎంపీటీసీ ఉపర్ల ప్రశాంతి, వైఎస్సార్‌సీపీ మండల పార్టీ అధ్యక్షుడు గాదె శివరామకృష్ణారెడ్డి, మండల ఉపాధ్యక్షుడు అళ్ల రమణారెడ్డి, అమర్తలూరు సాంబశివరావు, ఉప సర్పంచ్ టి.సాంబ శివరావు, కూచిపూడి బుజ్జిబాబు, రెడ్డి రాజేంద్ర, అన్నారెడ్డి వీరారెడ్డి, తుమ్మా బసివిరెడ్డి, కూచిపూడి లెనిన్, గ్రామ సర్పంచ్‌లు, సుబ్బారెడ్డి, పార్టీ నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



మహిళ సంక్షేమ పథకాల లబ్ధి కరపత్రాన్ని అందజేస్తున్న మంత్రి మేరుగ నాగార్జున

ఆలపాడులో నేడు 'గడప గడప'కు

ఆలపాడు(వేమూరు): గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఆలపాడు గ్రామంలో శనివారం ఉదయం మంత్రి మేరుగ నాగార్జున నిర్వహించనున్నారని మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు గాదె శివరామకృష్ణారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

అనారోగ్యంతో కానిస్టేబుల్ చలపతిరావు మృతి



నిజాంపట్నం: లివర్ వ్యాధితో మృతి చెందిన కానిస్టేబుల్ మోపిదేవి చలపతిరావు(39)అంత్యక్రియలను పోలీసు లాంఛనాలతో నిర్వహించారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న మోపిదేవి చలపతిరావు గుంటూరులోని ఓ ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారుజామున మృతి చెందారు. స్వగ్రామమైన నిజాంపట్నంలో అతని మృతదేహానికి పలువురు పోలీసు అధికారులు పూలమాలలు వేసి, నివాళులర్పించారు. మట్టి ఖర్చులు నిమిత్తం రూ.25 వేలను ఎస్ఐ రమేష్..చలపతిరావు కుటుంబానికి అందజేశారు. మృతిపట్ల ఎస్పీ వకుల్ జిందాల్ సంతాపం తెలిపారు. శాఖాపరంగా అతని కుటుంబానికి అన్ని పరిహారాలను, రాయితీలను సకాలంలో అందించేందుకు కృషిచేస్తామని ఎస్ఐ రమేష్ తెలిపారు.

బాపట్ల ఏరియా ఆసుపత్రిలో మరో 20 పడకలు

అభివృద్ధి కమిటీ సమావేశంలో ఎమ్మెల్యే కోన రఘుపతి

బాపట్ల: బాపట్ల ఏరియా వైద్యశాలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించేందుకు సిద్ధంగా ఉన్నామని వైద్య శాల అభివృద్ధి కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే కోన రఘుపతి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ఏరియా వైద్యశాలలో అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే కోన రఘుపతి మాట్లాడుతూ బాపట్ల, జిల్లా కేంద్రంగా మారిన తర్వాత ఆస్పత్రికి రోగుల సంఖ్య పెరిగిందన్నారు. దీనికి అనుగుణంగా వైద్య సేవలు మెరుగు పరుస్తున్నామని తెలిపారు. గతంలో ప్రతి చిన్న వైద్య సేవలకు గుంటూరుకు రెఫర్ చేసేవారని, కానీ ఇప్పుడు స్థానిక వైద్యశాలలోనే మెరుగైన వైద్యం అందుతోందని తెలిపారు. బాపట్ల ఏరియా వైద్యశాలను మాత, శిశు వైద్య శాలగా మార్చేందుకు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే చెప్పారు. ప్రస్తుతం 100 పడకల ఆసుపత్రి కాగా మరో 20 పడకలు పెంచేందుకు కృషి చేస్తున్నామని వెల్లడించారు. మెడికల్ కళాశాల నిర్మాణం పూర్తి చేసుకుంటే 500 పడకల వైద్యశాలగా తీర్చిదిద్దుతామని తెలిపారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలో పలు అభివృద్ధి పనులు చేపట్టేందుకు తీర్మానించారు.

తీర్మానించిన అంశాలు..

- ఆస్పత్రిలోని ఆపరేషన్ థియేటర్, ఓపీ ఏరియాలో ఇంటర్నెట్ సదుపాయం.
- ఆస్పత్రిలో మొత్తం 16 సీసీ కెమెరాలు ఉన్నాయి. వాటిలో పనిచేయని ఐదు కెమెరాల స్థానంలో కొత్తవి కొనుగోలు.
- 300 లీటర్ల డీజిల్ జనరేటర్ కొనుగోలు చేయాలని నిర్ణయం.
- సీడీఎస్ నుంచి సప్లై లేని కారణంగా 100 బెడ్ షీట్స్ కొనుగోలుకు ఆమోదం.
- ఆపరేషన్ థియేటర్లో అవసరమైన సర్జికల్ యాప్రాన్, ఓపీ విభాగంలో టూల్స్, సెప్టిక్ ట్యాంక్ వర్కులు, అత్యవసర సమయాల్లో ఎలక్ట్రికల్, వాటర్ మోటార్ పనులకు ఆమోదం తెలిపారు.

తొలుత వైద్యశాలను పరిశీలించిన ఎమ్మెల్యే రోగులకు అందుతున్న వైద్యసేవలను అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో డీసీ ఎ.వి.శేషుకుమార్, ఈఈ శ్రీధర్, డీఈ నాయక్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులు కోకి రాఘవరెడ్డి, అభివృద్ధి కమిటీ సభ్యులు వేల్పుల మీరాభి, చల్లా రామయ్య, రంగారావు తదితరులు ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోన రఘుపతి

'ఉప్పూడి'కి రూ.14.70కోట్ల లబ్ధి

'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎంపీ మోపిదేవి

రేపల్లె రూరల్: ఉప్పూడి గ్రామ పంచాయతీలో రాజ్యసభ సభ్యుడు, బాపట్ల జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు మోపిదేవి వెంకట రమణారావు శుక్రవారం సాయంత్రం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ పర్యటించారు. నాలుగేళ్ల కాలంలో వివిధ సంక్షేమ పథకాల ద్వారా పొందిన లబ్ధిని ప్రజలకు వివరించి, వారు స్థానికంగా ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకున్నారు. అధికారులతో చర్చించి, సత్వర పరిష్కార మార్గాలు చూపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పగ్గాలు చేపట్టిన నాటి నుంచి ఉప్పూడి పంచాయతీలో వివిధ సంక్షేమ పథకాల ద్వారా ప్రజలు రూ.14.70 కోట్లు లబ్ధిపొందారని తెలిపారు. గతంలో ఎన్నో ప్రభుత్వాలు ఉన్నప్పటికీ ఒక పంచాయతీలోనే ఇంత లబ్ధి చేకూరిన సందర్భాలు లేవన్నారు. ప్రజలకు మంచి చేసే ప్రభుత్వానికి స్థానికంగా అందుబాటులో ఉండే నేతలకు, ప్రజలు మద్దతుగా ఉండాలని ఎంపీ మోపిదేవి కోరారు. గ్రామంలో 210 గృహాలు పర్యటించి, ప్రభుత్వ పథకాలను వివరించారు. సర్పంచ్ గుజ్జర్లమూడి విజయబేబీ, ఇమ్మానుయేలు భాస్కర్, ఎంపీటీసీ అల్లంశెట్టి సతీష్‌బాబు, సర్పంచ్‌ల ఫోరం మండలాధ్యక్షుడు మండలి అంజయ్య, మాజీ జెడ్పీటీసీ మేడికొండ సుధాకర చంద్రహాసరావు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కార్పొరేషన్‌ల డైరెక్టర్లు పాల్గొన్నారు.



మహిళకు పథకాల లబ్ధిని వివరిస్తూ, సమస్యలు తెలుసుకుంటున్న ఎంపీ మోపిదేవి

విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు

పిట్టలవానిపాలెం: చందోలు నీలి బంగారయ్య జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ప్రోత్సాహక నగదు బహుమతులు శుక్రవారం అందజేశారు. ప్రథమ బహుమతి ఖదిరకు రూ.15,116లు, ద్వితీయ బహుమతి షేక్ జాస్మిన్‌కు రూ.10,116ల నగదును వైఎస్సార్ సీపీ నాయకుడు గాదె మధుసూదనరెడ్డి అందజేసి హెచ్ఎం కొల్లిపర మురళీధరరావును, ఉపాధ్యాయులను అభినందించారు. నాయకులు దేగల రవిరెడ్డి, దోమ నాగేశ్వరరెడ్డి, మద్దాల డేవిడ్, మస్తాన్‌బేగ్, రఫీ, ఆనందరావు, పట్టాభి, సయ్యద్‌నూరుల్లా పాల్గొన్నారు.

తప్పిన ప్రమాదం..!

ఓ ప్రవేట్ స్కూల్ బస్ అదుపు తప్పిన ఘటనలో పెను ముప్పు తప్పింది. స్థానికుల సమాచారం మేరకు శుక్రవారం అల్లపర్రు నుంచి 40 మంది విద్యార్థులతో రేపల్లె వెళ్తున్న ప్రైవేట్ స్కూల్ బస్ ఆర్అండ్‌బీ రహదారిపై అదుపు తప్పింది. డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించడంతో పక్కనే ఉన్న కాల్వలోకి బస్సు వెళ్లకుండా రహదారి అంచుకు వెళ్లి ఆగింది. ప్రమాదంలో ఎవరికీ ఎటువంటి గాయాలు కాలేదు. దీంతో విద్యార్థులు తల్లిదండ్రులు ఊపిరి పీల్చుకున్నారు. అక్రమ మట్టి తరలింపులు కారణంగా రహదారిపై బురద మట్టి పడటం, వర్షానికి బురద మట్టి జారడం వల్ల ప్రమాదం జరిగిందని విద్యార్థులు తల్లి దండ్రులు అగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

– నగరం



అనుమానాస్పద స్థితిలో వలంటీర్ ఆత్మహత్య



కర్లపాలెం: అనుమానాస్పద స్థితిలో వలంటీర్ ఆత్మహత్య చేసుకున్న ఘటన పెదగొల్లపాలెం పంచాయతీ మరకావారిపాలెంలో శుక్రవారం చోటుచేసుకుంది. స్థానిక ఎస్ఐ ఎం.శివయ్య వివరాల మేరకు.. మరకావారిపాలెం గ్రామానికి చెందిన మరకా వెంకటేశ్వర్లు పెద్ద కుమారుడు, గ్రామ వలంటీర్‌గా పనిచేస్తున్న మరకా రాజేష్(24) గురువారం అర్ధరాత్రి తమ పాత పూరి గుడెసెలో దూలానికి చీరతో ఉరివేసుకుని మృతిచెందాడు. మృతుడి తండ్రి వెంకటేశ్వర్లు ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. రాజేష్ మృతదేహాన్ని బాపట్ల ఏరియా వైద్యశాలలో పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఆయన చెప్పారు.

మద్యం మత్తులో స్నేహితుడి మొహంపై దాడి

వేమూరు: మద్యం మత్తులో స్నేహితుడి మొహంపై రాయితో దాడి చేసి, గాయపరిచిన ఘటనపై శుక్రవారం స్థానిక పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల వివరాల మేరకు.. చంపాడు గ్రామానికి చెందిన పీకా ప్రసంగి, వంశీ కృష్ణ స్నేహితులు. వంశీ కృష్ణ ఆటో నడుపుతూ ఉంటాడు. ఈ నెల 22న రాత్రి జంపని గ్రామంలో ఇద్దరూ మద్యం సేవించారు. ప్రసంగిని వేమూరులో వదిలేందుకు ఆటోలో వంశీ కృష్ణ తీసుకెళ్తున్నాడు. మార్గం మధ్యలో నీ భార్య ప్రవర్తన మంచిది కాదని ప్రసంగి వంశీకృష్ణతో అన్నాడు. దీంతో ఇద్దరు మధ్య గొడవ మొదలైంది. వేమూరు రైల్వే గేటు వద్దకు వచ్చిన తర్వాత ఆటో ఆపి..రోడ్డు పక్కన ఉన్న ఇటుక రాయితో ప్రసింగి వంశ కృష్ణ మొహంపై కొట్టాడు. వీరి గొడవను గమనించిన స్థానికులు 108 వాహనంలో తెనాలి ప్రభుత్వ వైద్య శాలకు గాయపడిన వంశీకృష్ణను తీసుకెళ్లారు. తెనాలి త్రీ టౌన్ పోలీసుల సమాచారం మేరకు.. కేసు నమోదు చేసి, విచారిస్తున్నట్లు వేమూరు ఎస్ఐ నాగరాజు తెలిపారు.

దోషులను వేగంగా శిక్షించాలని

బాపట్ల: చెరుకుపల్లి మండలం ఉప్పాలవారి గ్రామంలో జరిగిన ఘటన జిల్లాలో మరోసారి పునరావృతం కాకుండా చూడాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు పేర్కొన్నారు. కలెక్టర్ రంజిత్ బాషాను, ఎస్పీ వకుల్ జిందాల్‌ను శుక్రవారం వారి కార్యాలయాల్లో కలిసి, వినతి పత్రాలు అందజేశారు. విద్యార్థి అమర్‌నాథ్‌ను దారికాసి హతమార్చడం దుర్మార్గమన్నారు. ఫాస్ట్ ట్రాక్ కోర్టులో దోషులను వేగంగా శిక్షించాలని ఆయన కోరారు. జిల్లా ప్రధాన కార్యదర్శి బాపట్ల రవికుమార్, గౌరవాధ్యక్షుడు మద్దిబోయిన తాతయ్య, యువజన కమిటీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుర్రం ద్వారకా శ్రీను, బాపట్ల, వేమూరు నియోజవర్గ అధ్యక్షులు పాల్గొన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

చెరుకుపల్లి: పదో తరగతి విద్యార్థి ఉప్పాల అమర్నాథ్‌ను పెట్రోలు పోసి, కాల్చి చంపిన నిందుతులను కఠినంగా శిక్షించాలని సీపీఎం బాపట్ల జిల్లా కమిటీ సభ్యుడు సీహెచ్ మణిలాల్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని అంబేద్కర్ సెంటరులో సీఐటీయూ, ఎస్ఎఫ్ఐ, టీడీపీ, అమర్నాథ్ న్యాయ పోరాట సమితి ఆధ్వర్యంలో శుక్రవారం కొవొవ్వత్తుల ర్యాలీ నిర్వహించారు. అమర్నాథ్ చిత్ర పటానికి పూల మాలలు వేసి, నివాళులర్పించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు పి.మనోజ్‌కుమార్, సీఐటీయూ కె.శరత్ పాల్గొన్నారు.

ఐలవరం సచివాలయం తనిఖీ

వెల్లటూరు/ఐలవరం(భట్టిప్రోలు): ఐలవరం-1 సచివాలయాన్ని మండల ప్రత్యేకాధికారి డాక్టర్ ఎం. హనుమంతరావు శుక్రవారం సందర్శించి, రికార్డులను పరిశీలించారు. సచివాలయ సిబ్బంది, వలంటీర్ల పనితీరు, గృహ నిర్మాణాల పురోగతిపై సమీక్షించారు. గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం నిధులతో చేపట్టిన రహదారులు, జెడ్పీ హైస్కూల్‌లో అదనపు గదుల నిర్మాణ పనులను పరిశీలించారు. ఆయన వెంట ఇన్‌చార్జి సెక్రటరీ ఎండీ జిక్రియ, హౌసింగ్ ఏఈ రావూరి సౌమ్య, సచివాలయ సిబ్బంది ఉన్నారు. అలాగే వెల్లటూరు గ్రామీణ పశు వైద్యశాలను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. పశువులకు బీమా, సంపూర్ణ మిశ్రమ దాణా, పశు గ్రాస విత్తనాలను రైతులకు రాయితీపై అందజేయాలని ఆదేశించారు. వైద్యశాల అప్రోచ్ రోడ్డు అభివృద్ధి చేసినందుకు సిబ్బందిని అభినందించారు. కార్యక్రమంలో వీఏల్వో మహ్మద్ అలీ పాల్గొన్నారు.

నేడు ఉరుసు మహోత్సవం

రేపల్లె: పట్టణంలోని హజరత్ సయ్యద్ బురానుద్దీన్‌షా అవులీయా 80వ ఉరుసు మహోత్సవాలు శనివారం నిర్వహించనున్నట్లు ఈద్గా అధ్యక్షుడు షేక్ జమీర్ తెలిపారు. దర్గా వద్ద శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. రాత్రి 9 గంటలకు మేళతాళాలతో ఊరేగింపుగా గంధ మహోత్సవం ప్రారంభమవుతుందన్నారు. ఆర్గనైజర్‌లు షేక్ కాలే, సలీం, అరీఫ్, లాఖత్ బాషా, షేక్ సాజీ, డొక్కు గోపీ పాల్గొన్నారు.

కౌలు రైతుపై దాడి అమానుషం

బాపట్ల అర్బన్ : పొలం కౌలుకి తీసుకుని సాగు చేస్తున్న చుండూరుపల్లి గ్రామ రైతు సతీష్, అతని భార్యపై దాడి చేయడాన్ని ఖండిస్తున్నామని కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.హరిబాబు, సీపీఎం జిల్లా కార్యదర్శి సీహెచ్.గంగయ్య పేర్కొన్నారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సతీష్‌ను శుక్రవారం వారు పరామర్శించారు. వ్యవసాయ కార్మిక సంఘం, సీఐటీయూ జిల్లా కార్యదర్శులు టి.కృష్ణమోహన్, సీహెచ్.ముజుందర్, బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు కోటేశ్వరావు, నియోజకవర్గ ఇన్‌చార్జి విజయ్ కుమార్ ఉన్నారు.